# పరదార

"మిమ్మల్ని ఇంతకుముందు ఎక్కడో చూసినట్లుంది" సాలోచనగా ఆమె వంక చూస్తూ అన్నాడతను.

ఆమె మాట్లాడలేదు. ఆమాటలుతనకు చెందవన్నట్లు తలదించుకుంది.

"మీరు చెంగల్రావు పేటలో వుంటున్నారుకదూ" మళ్ళీ అన్నాడతను.

"అబ్బే లేదండీ! రైల్వే న్యూకాలనీలో వుంటున్నాం" ఈసారి చిరునవ్వుతో సమాధానం చెప్పిందామె.

"మరి మిమ్మల్ని ఎక్కడ చూసేను చెప్మా?" అంటూ స్వగతంలోని మాటలుపైకి వినిపించేలా అంటూ, కొంతసేపు ఆలోచనలోపడి, తర్వాత అడిగేడు.

"గవర్నమెంటు పాలీటెక్నిక్ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్గా పనిచేస్తున్న సోమరాజుగారు మీకు బంధువులా?"

"పాలిటెక్నిక్‌లో పనిచేసే వాళ్ళెవరూ నాకు తెలీదండి... అయినా మేం రాజులం కాదండీ"

"ఆఫ్‌కోర్స్! అయన పేరులో రాజువుందికానీ ఆయన కూడా రాజుకాదులెండి! పోనీ, డాక్టర్ కరుణాకరం, అంటే కె.జి. ఆసుపత్రిలో ఎముకల సర్జన్... మీకు బంధువులా? వారింట్లో మిమ్మల్ని చూసినట్లు జ్ఞాపకం..." ఎలాగయినా ఆమెను 'ట్రేసవుట్' చేద్దామని పట్టువదలని విక్రమార్కునిలా అడిగేడు అతను.

"క్షమించండి ! ఆయన కూడా నాకు తెలీదు"ప్రక్కనున్న మేగజైను చేతిలోకి తీసుకుంటూ అందామె.

గోదావరి ఎక్స్‌ప్రెస్ వేగంగానే వెళ్తోంది. సాయంకాలం అయిదున్నర దాటినా ఎండ వేడిమి తగ్గలేదు. వేడిగాలి కిటికీలో నుండి లోపలకు వస్తోంది.

"అబ్బ సమ్మర్ ఈ ఏడాది మరీ ఘోరంగా వుంది" అందామె కొంతసేపు పోయాక పమిట చెంగుతో ముఖానికి పట్టిన చెమటను ఒత్తుకుంటూ.

"మొన్న విశాఖపట్నంలో కాసిన ఎండ, అదే టెంపరేచరు, గత ఎనభైఏళ్ళలో గరిష్ఠంగా నమోదయిందట. రియల్లీ హారిబుల్ అవునూ... మీకు ఫ్రెంచ్ పాలిష్ కంపెనీ డైరెక్టరు రావుగారు తెలుసా?" మళ్ళీ ఆమె గురించిన జ్ఞాపకాలను 'రికలెక్ట్' చేసుకోటానికి ప్రయత్నిస్తూ అడిగేడతను.

"తెలీదండీ! సారీ! మీరెంతమందిని 'రిఫర్' చేసినా, అందరూ నాకుతెలియని వాళ్ళే అవుతున్నారు. బహుశ నన్నుపోలిన మరొకామెను మీరు చూసి వుంటారు." అందామె చిన్నగా నవ్వుతూ.

"పోనీ మొరార్జీదేశాయ్ గారు మీకు తెలుసా?" అన్నాడతను సీరియస్‌గా ఆమె వంక చూస్తూ.

ఆమె భ్రుకుటి ముడివడింది. ఆశ్చర్యంతో" ఎందుకుతెలీదూ? మన ప్రధానమంత్రిని తెలియక పోవటమేమిటి?" అంది.

అతను బరువుగా ఊపిరిపీల్చుకుని "అమ్మయ్య! అయితే ఆ విధంగానే మిమ్మల్ని నాకుతెలిసివుంటుంది. మొరార్జీ దేశాయ్‌గారు ప్రధానమంత్రిగా నాకూ తెలుసు. ఇప్పటికయినా మీకూనాకూ తెలిసిన ఓ కామన్ వ్యక్తి దొరకటం నా అదృష్టం" అన్నాడు.

ఆమె గలగలా నవ్వేసింది.

"మీరు భలే జోక్ చేస్తారు. నాపేరు భాగ్యలక్ష్మి! మా ఆయన బాటా కంపెనీలో పనిచేస్తున్నారు" అంది తలదించుకుని.

"ఈ ముక్క ఎప్పుడో ముందుగానే చెప్పేస్తే ఇంత రాద్ధాంతం అవసరం లేకపోను కదా! నాపేరు రంగారావు అతి చిన్నవాళ్ళను సైతం అతి ఆదరణతో చూసే ఓ అతిపెద్ద బేంకులో కేషియరుగా పనిచేస్తున్నాను. పెళ్ళయి మూడేళ్ళయింది. అప్పుడే పిల్లలు వద్దనుకున్నాం మేమిద్దరం. హైదరాబాద్‌లో ఓ స్నేహితుని పెళ్ళికి వెళ్తున్నా" అన్నాడతను నవ్వుతూ.

"మరి మీ ఆవిణ్ణి తీసుకు వెళ్ళటం లేదేం?" అడిగిందామె.

"మా ఆవిడ పురిటికెళ్ళింది కదా! అందుకని..." సిగరెట్టు ముట్టిస్తూ అన్నాడు "....మీకేం అభ్యంతరం లేదుకదా..."

"ఏమిటి? మీ ఆవిణ్ణి పురిటికి పంపటమా?" కాస్త గాభరాగా అడిగిందామె.

"అబ్బే సిగరెట్టు కాల్చటం..."

"నో!నో! నాటెటాల్.... అది సరే, ఇప్పుడే కదా 'పిల్లలు వద్దనుకున్నాం' అంటూ చెప్పేరు...."అంటూ అర్ధోక్తిగా ఆగిపోయింది.

"వద్దనే అనుకున్నామండీ కానీ మన చేతుల్లో ఏముంది చెప్పండి? మేన్ ప్రపోజెస్, గాడ్ డిస్పోజెస్ అని కదా అన్నారు"

"మీరు భలే మాట్లాడతారు" అంటూ కిలకిలా నవ్వేసింది ఆమె "హైదరాబాద్ వరకూ ఒక్కతెనూ ఎలాప్రయాణం చెయ్యాలా? అని భయంవేసింది. ఇంతమంచి కంపెనీ వుంటే, హైదరాబాదేమిటి? అమృతసర్ వరకూ ప్రయాణం చెయ్యొచ్చు! మా ఆయన్ని శెలవుపెట్టి రమ్మంటే ససేమిరా అన్నారు, ఇతరుల పాదసేవచేసే భాగ్యం తగ్గిపోతుందని ఆయన భయం." అంటూ గలగలా మాట్లాడింది.

"పాదసేవ ఏమిటండోయ్" అడిగేడతను.

"మా ఆయన బాటాషోరూమ్‌లో పనిచేస్తున్నారు కదా"

"గుడ్ జోక్" అంటూ నవ్వేడతను.

ఆమె మెల్లగా కిందకు వంగి సీటు కింద నున్న ప్లాస్టిక్ బుట్టను బయటకు లాగింది.దానిలోంచి ఓ మూలగా వున్న ఖాళీ సీసా బయటకు తీసి సీటుమీద పెట్టి,

మళ్ళీ బుట్టసీటు కిందకి తోసేసింది. కిందకు వంగినపుడు రంగారావు ఆమెవంకే తదేకంగా చూశాడు.

వదులుగా వేసుకున్న తాచుపాములాంటి ఆమె నిడువైన జడ మెడమీదుగా జారిపోయి ఆమె బుగ్గల్ని తాకుతూ కిందకు దిగిపోయింది. తెల్లని నుదుటిమీద ఎర్రని తిలకం బొట్టు సాయంకాలపుసూర్యబింబంలా వెలిగిపోతోంది. 'ఎంత చక్కదనం' అనుకున్నాడు. 'ఇంత చక్కని ఆమెతో ఇలా ప్రయాణం చేసే అవకాశం కలిసి రావటం ఎంత అదృష్టం?' అని కూడా అనుకున్నాడు రంగారావు.

సీసా తియ్యటానికి ముందుకువంగిన భాగ్యలక్ష్మి అతని ఫేంట్ 'బెల్‌బాటం' వంక చూసింది.ముప్పయి వుంటుంది 'బెల్‌లూజు' అనుకుంది. తర్వాత అతను వేసుకున్న 'హైహీల్స్' బూట్లు వంకచూసింది. అవి బాటా కంపెనీవే! భర్త జ్ఞప్తికి వచ్చేడు.

తనకి బూట్లు అంటేనే ఇష్టం. తన భర్త ఎప్పుడూ బూట్లు వేసుకోడు. 'ఆరామ్' చెప్పల్స్‌లో బ్రతుకేహాయి. 'బ్రీజీ చెప్పల్స్‌తో ఈజీగా నడవొచ్చు' అంటూ బాటా నినాదాలు చేస్తాడు. 'మండే ఎండలకు పండిన అందాలు' అంటూ ఎర్రని చెప్పులు తెచ్చి తనకూ ఇచ్చేడు. పోనీ, పేంటయినా బెల్ పెట్టించుకొని లూజుగా కుట్టించుకోవచ్చుకదా! పేంటు బాటమ్‌లూజు ఇరవైదాటితే, ఊరోసుకునే వాడిలా కనిపిస్తాడు, చేసుకున్నవాళ్ళకి చేసుకున్నంత!'

'ఈ బూట్లలో , ఈ బట్టల్లో రంగారావు ఎంత బాగున్నాడో' అనుకుంది భాగ్యలక్ష్మి. మళ్లీ అంతలోనే తన ఆలోచనలకు తానే మనసులో నొచ్చుకుంది. 'ఏమిటీ పాడు ఆలోచనలు' అంటూ తన అంతరాత్మను ఇవతలకు కేకేసి నాలుగు చీవాట్లు పెట్టింది. అంతరాత్మ 'నీఖర్మ' అంటూ ఫేడవుటయిపోయింది. భాగ్యలక్ష్మి ఈ లోకంలోకి వచ్చింది. సీసా సీటుపైన పెట్టిన తర్వాత సీటులో వెనక్కు జారగిలబడింది.

"ఏమిటి? హఠాత్తుగా ఆలోచనలోపడ్డారు?" రంగారావు అడిగేడు.

"అబ్బే ఏంలేదు! చాలా దాహంగా వుంది. నీళ్ళు సీసాలో నింపటం మరిచిపోయాను. వాల్తేరు ప్లాట్‌ఫాం మీద చల్లనినీళ్ళు వుంటాయికదా, మా ఆయన్ని తెమ్మందామనుకుని మరిచిపోయాను. అయినా, ఆయనకు నా సంగతి అసలుపట్టదు. రైలెక్కించి 'లక్ష్మీ నీళ్ళువున్నాయా?' అని కనీసం అడగనయినాలేదు. గబగబావెళ్ళిపోయారు" అంటూ నిట్టూర్చింది. "సారీ! నా దగ్గరాలేవు ఇంకో అయిదు నిమిషాల్లో అనకాపల్లి చేరుకుంటాం. నేను తెస్తానులెండి"అన్నాడు.

"అబ్బే మీకెందుకు శ్రమ?" అంది మొహమాటం అభినయిస్తూ

"ఇందులో శ్రమ ఏముంది?" అన్నాడు రంగారావు

కొద్దిక్షణాలలోనే అనకాపల్లి ప్లాట్‌ఫారంమీద రైలు ఆగింది.

సీసా పట్టుకుని లేచాడు రంగారావు

"మన బోగీ ప్లాట్‌ఫాం మీద బాగా ముందుకు వచ్చేసింది. పోనీ, తునిలో తెచ్చుకోవచ్చును లెండి. ఇక్కడ ఎక్కువసేపు ఆగదు" అంది భాగ్యలక్ష్మి.

"మీకెందుకు? క్షణంలో తెస్తాను" అంటూ వడివడిగా అడుగులు వేసుకుంటూ బోగీ దిగిపోయాడు రంగారావు. కిటికీలోంచి చూస్తుండగానే కొద్దిసేపట్లోనే జనంలో కలిసిపోయాడు.

కిటికీ నుండి అతడు వెళ్ళిన వంకే చూస్తోంది భాగ్యలక్ష్మి. అంతలోనే గార్డు విజిల్ ఊదేడు. ఇంజను కూత పెట్టింది. గాభరాగా చూసింది భాగ్యలక్ష్మి.

రైలు మెల్లగా కదిలింది. అతను ఇంకా రాలేదు. ఆమెకు ఏం చేయాలో తోచటంలేదు.

అంతలోనే దూరాన అతని గళ్ళషర్టు కనబడింది. సీసా ఓ చేత్తో పట్టుకుని పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. రైలు వేగం పుంజుకుంటోంది. భాగ్యలక్ష్మికి గాభరా ఎక్కువయింది. 'తన మూలంగా పాపం. అతనికి శ్రమ ఇచ్చేను కదా!' అని కూడా అనుకుంది. అతడు ఇంకా వేగంగా పరుగెత్తుకుంటూ వచ్చి కంపార్టుమెంటు తలుపు దగ్గరి ఊచ అందుకున్నాడు. రైలు అప్పుడే బాగా వేగం అందుకుంది. 'అతడి పడిపోడుకద!' ఆమెగుండె గుబగుబలాడింది.

ఒడుపుగా ఊచపట్టుకుని కంపార్టుమెంటు ఎక్కి లోనికి వచ్చేశాడతను.

భాగ్యలక్ష్మి గుండెలమీద నుండి పెద్ద బరువు దిగినట్లయింది. బరువుగా ఊపిరిపీల్చుకుంది.

రొప్పుకుంటూ సీటు దగ్గరకు వచ్చేడురంగారావు. రుమాలుతో ముఖం తుడుచుకుంటూ ఆమెకు నీళ్ళసీసా అందించేడు.

"క్షమించండి! మీకుచాలా శ్రమ ఇచ్చేను" అంది.

"ఫర్వాలేదు" అన్నాడు రంగారావు.

"మావారయితే, నాకోసం ఇంత రిస్క్ తీసుకుని వుండే వారుకాదు" అంది కృతజ్ఞతాపూర్వకమయిన తీయని చూపులతో అతని కళ్ళలోకి చూస్తూ.

'అఫ్‌కోర్స్! మా ఆవిడకోసమయితే నేనూ ఇంత రిస్క్ తీసుకునేవాణ్ణికాదు!' అని మనసులోనే అనుకున్న రంగారావు పైకి మాత్రం "థేంక్యూ" అన్నాడు. ★

(ఆంధ్రప్రభ వీక్లీ 1978)